క్లుప్తంగా

గ్రామదేవతలకు బోనాలు



పూజలందుకుంటున్న కాటమయ్యస్వామి

బత్తలపల్లి: ఎం.చెర్లోపల్లి, చీమలనాగేపల్లిలో ఆదివారం భక్తులు గ్రామ దేవతలకు బోనాల కార్యక్రమం నిర్వహించారు. ఎం.చెర్లోపల్లిలో ఉన్న పోతలయ్యస్వామిని గ్రామస్తులు పూలు, ఆభరణాలతో అందంగా అలంకరించి పూజలు చేపట్టారు. గ్రామంలోని ప్రతి ఇంటి నుంచి కొత్త కుండలో చేసిన తీపి అన్నం, నారికేళాలను, పూలను తీసుకుని ఊరేగింపుగా తీసుకెళ్లి స్వామికి సమర్పించారు. అనంతరం మూగజీవాలను బలి ఇచ్చి మొక్కులు తీర్చుకున్నారు. చీమలనాగేపల్లి గ్రామంలో వెలసిన గంగమ్మ తల్లి, కాటమయ్య స్వామికి గ్రామస్తులు బోనాలు తీసుకువెళ్లి, జంతుబలులు ఇచ్చారు.

వైద్య శిబిరం



వైద్య శిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

కదిరి అర్బన్: ఎగువపల్లిలో ఆదివారం పట్నం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ వినోద్‌కుమార్ 19 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. అందులో నలుగురికి జ్వరం ఉన్నట్లు గుర్తించి మందులు అందజేశారు. కార్యక్రమంలో సిబ్బంది దేవ్లానాయక్, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

హాస్టల్ వార్డెన్ అదృశ్యం

కదిరి అర్బన్: పట్టణంలోని నల్లగుట్టవీధిలో నివాసం ఉండే ఎస్టీ బాయ్స్ హాస్టల్ వార్డెన్ దుర్గాప్రసాద్ అదృశ్యమయ్యాడు. శుక్రవారం ఇంటి నుంచి బయటకు వెళ్లిన అతడు తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు తెలిసిన చోటల్లా గాలించినా ప్రయోజనం లేకపోయింది. ఆదివారం వార్డెన్ భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి గాలింపు చేపట్టినట్లు సీఐ నారాయణరెడ్డి తెలిపారు.

వక్ఫ్ సవరణ చట్టం రద్దు చేయాలి



రిలే నిరాహార దీక్ష చేస్తున్న ముస్లింలు

ధర్మవరం: వక్ఫ్ సవరణ చట్టం రద్దు చేయాలని జామియా మసీద్, ఫిరదోస్ మసీద్ కమిటీ సభ్యులు డిమాండ్ చేశారు. పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం బయట ముస్లింలు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు ఆదివారం రెండోరోజూ కొనసాగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన కేంద్ర ప్రభుత్వం ముస్లింల ఆస్తులను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని ఆలోచనతో వక్ఫ్ ఆస్తులకు సంబంధించిన జీఓను పార్లమెంట్‌లోకి తీసుకువచ్చారన్నారు. అనేక సంవత్సరాలుగా తమ ఆస్తులను కాపాడుకుంటూ ఖబర్‌స్తాన్, మసీదులు, ఈద్గాలు, మదరసాలు, పేద ముస్లింలు, వికలాంగుల అభివృద్ధి కోసం ఉపయోగించుకుంటున్నామన్నారు. బీజేపీ ప్రభుత్వం ఆ ఆస్తులను లేకుండా చేయాలనే ఆలోచనతో వక్ఫ్ కమిటీల్లో అన్యమతస్తులకి ప్రవేశం కల్పించేలా చట్ట సవరణ చేసిందన్నారు. వక్ఫ్ ఆస్తులు కాపాడుకునే దాకా పోరాటాలు చేస్తామన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం వక్ఫ్ సవరణ చట్టం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ముస్లిం మైనారిటీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

షార్ట్‌సర్క్యూట్‌తో గృహోపకరణాలు దగ్ధం



కాలిపోయిన వస్తువులను చూపుతున్న అనిత

ధర్మవరం రూరల్: ఓబుళనాయనపల్లిలో శనివారం రాత్రి విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో గృహోపకరణాలు కాలిపోయాయి. వివరాలు.. గ్రామానికి చెందిన అనిత ఆదివారం ఇంటికి తాళం వేసి బయటకు వెళ్లింది. ఇంతలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మంటల చెలరేగి ఫ్రిజ్, టీవీ, ఫ్యాన్లు, ఇతర వస్తువులు కాలిపోయాయి. చుట్టుపక్కల వారు గమనించి మంటలు అదుపుచేసేందుకు యత్నించినప్పటికీ ఫలితం లేకపోయింది. ఘటనలో రూ.లక్ష దాకా నష్టం వాటిల్లినట్లు బాధితురాలి వాపోయింది.

పెద్దమ్మదేవతకు పూజలు

ముదిగుబ్బ: మండల కేంద్రంలోని పాతూరులో వెలసిన పెద్దమ్మ దేవతకు ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా అమ్మవారికి వెండి ఆభరణాలు, వివిధ రకాలు పుష్పాలతో అలంకరించి విశేష పూజలు చేశారు. అమ్మవారిని దర్శించుకోవడానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.

కానరాని అభివృద్ధి జాడ!

- పూర్తి కాని సచివాలయాలు
- శిథిలావస్థలో సంక్షేమ వసతిగృహాలు
- గ్రామాల్లో పడకేసిన పారిశుధ్యం
- రహదారుల సంగతి సరేసరి
- ప్రజలకు తప్పని కష్టాలు



ఓడీచెరువులో రోడ్డుపై మురుగునీరు



కంకర తేలిన ఉగ్గిరెడ్డిపల్లి రోడ్డు

ఓడీచెరువు: తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రగతిని పరుగులు పెట్టిస్తాం. అభివృద్ధిలో ఆంధ్రప్రదేశ్‌ను అగ్రగామిగా నిలుపుతామని ఆ పార్టీల నాయకులు ప్రగల్భాలు పలికారు. అధికారంలోకి వచ్చి 10 నెలలు గడుస్తున్నా గ్రామాల్లో అభివృద్ధి జాడ కనపించడ లేదు కదా. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేపట్టిన పనులను కూడా పూర్తి చేయలేకున్నారు. ప్రధానంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం గ్రామాల్లోనే ప్రజలకు సేవలందించాలనే ఉద్దేశంతో ప్రతి 2 వేల జనాభాకు ఒక సచివాయం చొప్పున ఏర్పాటు చేసింది. ఇందులో భాగంగా గత ప్రభుత్వం 2 గ్రామ సచివాలయ భవనాలను పూర్తి చేయగా ఇంకా 8 భవనాలను 80 శాతం పూర్తి చేసింది. అయితే కూటమి ప్రభుత్వం మిగిలిన పనులను కూడా పూర్తి చేయలేకపోతోంది. దీంతో ఆ భవనాలు అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారాయి.

అధ్వానంగా వసతిగృహాలు...

మండలవ్యాప్తంగా 5 ప్రభుత్వ వసతిగృహాలున్నాయి. ఇందులో ఇంటిగ్రేటెడ్ హాస్టల్ మినహా అన్నింటిలోనూ కనీస సౌకర్యాలు కరువయ్యాయి. కొండకమర్లలోని హాస్టల్ అద్దె భవనంలో కనీస సౌకర్యాలు లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఇక మిగిలిన వసతిగృహాలు శిథిలావస్థకు చేరడంతో విద్యార్థులకు కష్టాలు తప్పడం లేదు. ఇక ఎన్నికల ముందు రహదారులను అభివృద్ధి చేస్తామని హామీలు గుప్పించిన నాయకులు ఇప్పుడు మండలంలోని 14 పంచాయతీల్లో ఎక్కడా తారురోడ్డు వేయలేదు. కొన్నిచోట్ల సీసీరోడ్లతో సరిపెట్టేశారు. ఇది గత ప్రభుత్వంతో పోలిస్తే కేవలం ఒక్క కొండకమర్ల పంచాయతీలో వేసిన రోడ్లకు సమానం.

అస్తవ్యస్తంగా డ్రైనేజీ వ్యవస్థ

మండల కేంద్రంతోపాటు పంచాయతీల్లో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. ప్రధానంగా డ్రైనేజీలు లేకపోవడంతో మురుగునీరంతా రోడ్లపై పారుతోంది. దీంతో ప్రజలు రోడ్లపై నడవడానికి కూడా ఇబ్బందులు పడుతున్నారు. మరోవైపు పారిశుధ్య పనులు సరిగా చేపట్టకపోవడంతో రోగాలు ప్రబలి ప్రజలు ఆస్పత్రులకు పరుగులు తీయాల్సిన పరిస్థితి నెలకొంది.

ఒక్క పనీ మొదలు పెట్టలేదు



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 10 నెలలు పూర్తయినా పంచాయతీలో ఒక్క అభివృద్ధి పని మొదలుపెట్టలేదు. సీసీరోడ్లు నిర్మించడంతోపాటు తాగునీటి సమస్య తీర్చాలని ప్రజలు కోరుతున్నారు. ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో ఏ చేయలేకపోతున్నాం. ప్రభుత్వం పంచాయతీ అభివృద్ధికి నిధులు విడుదల చేసి టీడీపీ నాయకులు పని చేస్తామన్నా పంచాయతీ తీర్మానం ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నాం.

– అభిదాభాను, తంగేడుకుంట సర్పంచ్

అధ్వానంగా డ్రైనేజీ వ్యవస్థ



మండల కేంద్రంలో డ్రైనేజీ వ్యవస్థ అధ్వానంగా తయారైంది. డ్రైనేజీలు లేకపోవడంతో మురుగునీరంతా రోడ్లపై పారుతోంది. ఎక్కడా చూసిన మురుగునీరు నిల్వ ఉండటంతో రోగాలు ప్రబలి ప్రజలు ఆస్పత్రుల పాలవుతున్నారు. పారిశుధ్య కార్మికులకు జీతాలు కూడా చెల్లించలేని దుస్థితి నెలకొంది. కూటమి ప్రభుత్వం ఇప్పటికైనా డ్రైనేజీ వ్యవస్థతోపాటు అభివృద్ధిపై దృష్టి సారించాలి.

– కోళ్ల కృష్ణారెడ్డి, ఓడీచెరువు

బాధిత కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే పరామర్శ



నరేంద్రనాయుడు మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి

ఓడీచెరువు: కమ్మవారిపల్లికి చెందిన మారపురి నరేంద్రనాయుడు(55) శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన విషయం తెలిసిందే. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి ఆదివారం గ్రామానికి చేరుకుని నరేంద్రనాయుడు మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి అధైర్యపడొద్దని అండగా ఉంటానని భరోసా కల్పించారు. కార్యక్రమంలో చింతమానిపల్లి సర్పంచ్ జగన్‌మోహన్ చౌదరి, నాయకులు లక్ష్మీరెడ్డి, రమణ తదితరులు పాల్గొన్నారు

నల్లమాడ : మండలంలోని వేళ్లమద్ది గ్రామానికి చెందిన కొమ్ము పెద్దవెంకటరమణ (65) అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి ఆదివారం గ్రామానికి చేరుకుని కొమ్ము పెద్దవెంకటరమణ మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి అధైర్య పడొద్దని అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ బొజేంజనాయక్, మండల కన్వీనర్ సూర్యనారాయణ, నాయకులు హరి, సీతారామ్, మంగేనాయక్ తదితరులు పాల్గొన్నారు .

హైవే పనులతో రైతులకు కష్టాలు

- క్రషర్ యూనిట్‌తో పంటలపై ప్రభావం



చెరువుమునెప్ప పల్లి వద్ద గ్రీన్ ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే క్యాంపు

ఓడీచెరువు: గ్రీన్ ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే రోడ్డు పనుల కారణంగా రైతులకు కష్టాలు మొదలయ్యాయి. క్రషర్ యూనిట్‌తో పంటలపై ప్రభావం పడుతోందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వివరాలు..గ్రీన్ ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే పనుల్లో భాగంగా చెరువుమునెప్ప పల్లి వద్ద క్యాంపు కార్యాలయంతోపాటు స్టోన్ క్రషర్ యూనిట్ ఏర్పాటు చేశారు. యూనిట్ సమీపంలో రైతుల పంట పొలాలు, మామిడి తోటలు పెద్దసంఖ్యలో ఉన్నాయి. నిత్యం హై వే పనులు జరుగుతుండటంతో క్రషర్ యూనిట్‌లోని దుమ్ము, ధూళి పంట పొలాలపై పడుతుండంతో పంటల దిగుబడిపై ప్రభావం చూపుతున్నట్లు రైతులు చెబుతున్నారు. మరోవైపు పొలాల్లో హైవే పనులకు సంబంధించిన వాహనాల రాకపోకలు సాగించడంతో భూమి గట్టిపడిపోయి సాగుకు యోగ్యం కాకుండా పోయిందని పేర్కొంటున్నారు. దుమ్ము, ధూళి మామిడి తోట దిగుబడిపై ప్రభావం చూపుతున్నట్లు వాపోతున్నారు. రెండేళ్లలో రూ.లక్షల విలువైన పంట దిగుబడి కోల్పోయాని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పనుల్లో జాగ్రత్తలు పాటించాలని సంబంధిత కాంట్రాక్టర్ దృష్టి తీసుకెళ్లగా ఆయన నిర్లక్ష్యంగా సమాధానమిస్తున్నారని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని రైతులు కోరుతున్నారు.

సామాజిక సేవలో రోటరీక్లబ్ ముందంజ



కంటి వైద్యుడిని సన్మానిస్తున్న రోటరీక్లబ్ సభ్యులు

ధర్మవరం అర్బన్: సామాజిక సేవలో రోటరీక్లబ్ ముందంజలో ఉంటుందని ప్రతినెలా కంటి శస్త్ర చికిత్సలతో పేదలకు చూపును అందిస్తున్నామని రోటరీక్లబ్ అధ్యక్షుడు జయసింహ తెలిపారు. పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో ఆదివారం రోటరీక్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. శిబిరంలో 197మందికి కంటి పరీక్షలు చేయగా 165 మంది కంటి శస్త్ర చికిత్సలకు ఎంపికయ్యారని జయసింహ తెలిపారు. బెంగళూరులోని శంకర్ కంటి ఆసుపత్రి వైద్యులు శస్త్ర చికిత్సకు ఎంపికైనవారికి ఆపరేషన్లు చేస్తారన్నారు. అనంతరం వైద్యులు, దాతలను శాలువాలతో సత్కరించారు. రోటరీక్లబ్ ఉపాధ్యక్షుడు నరేంద్రరెడ్డి, కార్యదర్శి నాగభూషణ, కోశాధికారి సుదర్శన్‌గుప్త, సభ్యులు శ్రీనివాసరెడ్డి, కొండయ్య, శివయ్య, రత్నశేఖర్‌రెడ్డి, రమేష్, బీవీ చలం, మనోహర్‌గుప్త, పెరుమాళ్‌దాస్, ప్రసన్నకుమార్, రామకృష్ణ కంటి ఆసుపత్రి వైద్యులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశమైన పూర్వ విద్యార్థులు

అ‘పూర్వ’ సమ్మేళనం

ధర్మవరం అర్బన్: పట్టణంలోని లయోలా ఉన్నత పాఠశాలలో 2001–2004 బ్యాచ్ విద్యార్థులు సమావేశమయ్యారు. దాదాపు 21 ఏళ్ల తర్వాత ఒకచోట కలవడంతో వారి సంతోషాలకు అవధులు లేకుండా పోయాయి. గత జ్ఞాపకాలు గుర్తు చేసుకుని ఆనందంగా గడిపారు. అనంతరం పాఠశాల కరస్పాండెంట్ శంకర్‌నాయుడు, వనజ, అలనాటి గురువులు శివయ్య, పురుషోత్తం, అమానుల్లా, నాగార్జున, పద్మ, చంద్రశేఖర్, గురుప్రసాద్, చంద్రశేఖర్‌గౌడ్, శ్రీనివాసులు, చంద్రాయుడు, ఆంజనేయులును పూర్వ విద్యార్థులు శాలువాలతో సన్మానించారు.

ఇంటర్‌లో గ్రామీణ విద్యార్థినుల ప్రతిభ



జోగి పావణి, 969



దీక్షిత, 948



పూజారి ధరణి, 944

కనగానపల్లి: పట్టణాల్లోని కార్పొరేట్ కళాశాల విద్యార్థులు ధీటుగా గ్రామీణ ప్రాంతానికి చెందిన విద్యార్థులు సీనియర్ ఇంటర్ ఫలితాల్లో 90 శాతానికి పైగా మార్కులు సాధించారు. కేఎన్ పాళ్యం గ్రామానికి చెందిన రైతు జోగి అంజనమ్మ కూతురు జోగి పావణి ఎంపీసీ గ్రూపులో 969 మార్కులు సాధించింది. ఇక మామిళ్లపల్లి గ్రామానికి చెందిన కుణుతూరు దామోదర్‌రెడ్డి కూమార్తె దీక్షిత 948 మార్కులు, కోనాపురం గ్రామానికి చెందిన కూలీ ముత్యాలు కూతురు పూజారి ధరణి 944 మార్కులు సాధించారు. వీరిని స్థానిక గ్రామాల ప్రజలు ప్రత్యేకంగా అభినందించారు.

ఇంటర్‌లో బాలికల కళాశాల విద్యార్థుల ప్రతిభ

ధర్మవరం: ప్రభుత్వం శనివారం విడుదల చేసిన ఇంటర్ ఫలితాల్లో స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల విద్యార్థినులు ప్రతిభ చాటినట్లు కళాశాల ప్రిన్సిపాల్ మహాలక్ష్మి ఆదివారం తెలిపారు. ద్వితీయ సంవత్సరంలో పల్లవి958, ఫర్‌హీన్‌కౌసర్954, జీవన950, కుమన936, శిరీష926, మహేశ్వరి848, రూప956, అప్స 904 మార్కులు సాధించారన్నారు. ప్రథమ సంవత్సరంలో భవాని 461, గాయిత్రి457, సాయిశిల్ప429, ఉషారాణి427, నాగహారిక420, అంజుమ్418 మార్కులు సాధించినట్లు తెలియజేశారు.

ముదిగుబ్బ: స్థానిక కస్తూర్బా బాలిక విద్యాలయం విద్యార్థినులు ఇంటర్‌లో ఉత్తమ ఫలితాలు సాధించినట్లు ప్రిన్సిపాల్ సుగంధ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. మొదటి సంవత్సరం బైపీసీలో 16 మందికి గాను 13 మంది, ద్వితీయ సంవత్సరంలో 28 మందికి గాను 24 మంది ఉత్తీర్ణత సాధించినట్లు పేర్కొన్నారు.

పుట్టపర్తి టౌన్: బుక్కపట్నం కస్తూర్బా బాలిక విద్యాలయంలో ఇంటర్(ఫస్టియర్, సెకండియర్)లో 100 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ సౌజన్య ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. సెకండియర్‌లో సునిత 973, నవిత 971, పావని 969 మార్కులు సాధించారని పేర్కొన్నారు. ఫస్టియర్‌లో 450 మందిపైగా 10 మంది విద్యార్థినులు, సెకండియర్‌లో 8 మంది విద్యార్థినులు 900 పైగా మార్కులు సాధించినట్లు తెలియజేశారు.

సోలార్ పవర్ ప్రాజెక్టుతో రైతులకు నష్టం



రైతులతో మాట్లాడుతున్న రైతు సంఘం నాయకులు

ఎన్పీకుంట: మరికొమ్మదిన్ని పంచాయతీలో ప్రభుత్వం సోలార్ నిర్మాణం చేపట్టడం కోసం ప్రతిపాదనలు సిద్ధం చేసిందని, సోలార్ పవర్ ప్రాజెక్టుతో భూములు కోల్పోవడం తప్ప రైతులకు ఒరిగేది ఏమీ లేదని రైతు సంఘం జిల్లా కార్యదర్శి హరి పేర్కొన్నారు. సోలార్ ప్రాజెక్టు ఏర్పాటవుతున్న మరికొమ్మదిన్ని పంచాయతీలోని పలు గ్రామాల్లో ఆదివారం భూములో కోల్పోయే రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఎన్.పీ.కుంట, పి కొత్తపల్లి పంచాయతీలో పవర్ ప్రాజెక్టు ఏర్పాటు చేసే సమయంలో స్థానిక నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామని, పశువుల మేత బీళ్లకు 500 ఎకరాల భూమి కేటాయిస్తామని చెప్పి నిరుద్యోగ యువతకు, రైతులకు మోసం చేశారని గుర్తుచేశారు. సోలార్ ప్రాజెక్టుతో వ్యవసాయానికి, పశువుల మేతకు భూమి కరువై, జీవనోపాధి కోల్పోయి ప్రజలు వలసలు వెళ్లి గ్రామాలు, పల్లెలు కనుమరుగు అవుతాయన్నారు. కార్పొరేట్ సంస్థలకు రైతుల భూములను అప్పనంగా కట్టబెట్టేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రయత్నిస్తున్నాయే తప్ప రైతులకు మంచి చేయాలనే ఉద్దేశం లేదన్నారు. సోలార్ ప్రాజెక్టు కోసం కౌలు పద్ధతిలో రైతుల నుంచి భూములు సేకరించాలని, రెండేళ్లకోసారి 20 శాతం కౌలు పెంచాలన్నారు. భూములకు సంబంధించిన ఒరిజినల్ పత్రాలు కాకుండా జిరాక్స్ కాపీలు మాత్రమే సోలార్ కంపెనీవారు తీసుకోవాలన్నారు. లీజు తీసుకున్న భూములపై సోలార్ కంపెనీలు ఎటువంటి బ్యాంకుల్లో రుణాలు తీసుకోకుండా షరతులు విధించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు నాగిరెడ్డి, సుధాకర్‌రెడ్డి, నాగరాజు, ఈశ్వర్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

బాలుడికి తీవ్రగాయాలు

ధర్మవరం రూరల్: పట్టణంలోని రాజేంద్రనగర్‌కు చెందిన ఏడేళ్ల బాలుడు మాదేష్ ఇంటి ముందు ఆడుకుంటుండగా గుర్తు తెలియని బైక్ ఢీకొని వెళ్లిపోయింది. ప్రమాదంలో మాదేష్ ఎడమ కాలుకు తీవ్రమైన గాయమైంది. కుటుంబ సభ్యులు ధర్మవరం ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. వైద్యుల సూచనల మేరకు అనంతపురం తీసుకెళ్లారు.

ప్రశాంతంగా ప్రవేశ పరీక్ష

కదిరి అర్బన్: కాళసముద్రంలో ఉన్న డా. బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో ఆదివారం ఏపీఆర్‌జేసీ ప్రవేశ పరీక్ష జరిగింది. ఉదయం 5 వ తరగతి ప్రవేశాలకు జరిగిన పరీక్షలకు 557 హాజరు కావాల్సి ఉండగా 493 మంది హాజరైనట్లు అధికారులు తెలిపారు. మధ్యాహ్నం ఇంటర్ ప్రవేశాలకు నిర్వహించిన పరీక్షలో 302 మందికిగాను 55 మంది గైర్హాజరైనట్లు ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు తెలియజేశారు. పరీక్షలను ఎంఈఓ ఓబుల్‌రెడ్డి తనిఖీ చేశారు.

బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే కఠిన చర్యలు

ధర్మవరం రూరల్: బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని వన్‌టౌన్, టూటౌన్ సీఐలు నాగేంద్రప్రసాద్, రెడ్డప్ప పేర్కొన్నారు. ఆదివారం రాత్రి పట్టణ సరిహద్దులోని పలు ప్రదేశాల్లో సిబ్బందితో కలిసి పర్యటించారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తున్న పలువురిని స్టేషన్‌కు తరలించి కౌన్సెలింగ్ ఇచ్చారు. వారిపై పెట్టీ కేసు నమోదు చేసినట్లు వారు తెలిపారు.

కాశీలో విశ్రాంత ఉపాధ్యాయుడి మృతి

ఎన్పీకుంట: తీర్థయాత్రకు వెళ్లిన విశ్రాంత ఉపాధ్యాయుడు అక్కడే మృతి చెందాడు. విశ్రాంత ఉపాధ్యాయుడు వెంకటరమణ(75) బంధువులతో కలిసి కాశీకి వెళ్లారు. అనారోగ్యంతో ఆదివారం మధ్యాహ్నం మృతి చెందాడు. కాశీలోనే దహన సంస్కారాలు నిర్వహించనున్నట్లు ఆయన సన్నిహితులు తెలిపారు. ఈయన భార్య శకుంతలమ్మ విశాంత్ర ఎంఈఓ. ఎంఈఓ గోపాల్‌నాయక్, ఉపాధ్యాయులు చంద్రాయుడు, క్లర్క్ అల్లాఉద్దీన్, తదిరులు వెంకటరమణ మృతికి సంతాపం తెలిపారు.

లోన్ కట్టకుండా మోసగించిన వ్యక్తిపై కేసు నమోదు

కదిరి అర్బన్: లోన్ తీసుకుని కట్టకుండా మోసం చేసిన వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. పట్టణంలోని యాకుబ్ వీధికి చెందిన షాబాజ్‌బాషా తన స్నేహితుడు అమీనుల్లాకు తన సెల్‌ఫోన్‌లో యాప్ ద్వారా రూ.2 లక్షల లోన్ ఇప్పించాడు. అయితే కంతులు కట్టడం లేదు. తనతోపాటు మరో 8 మంది దగ్గర ఇలా లోన్ తీసుకున్నట్లు గుర్తించాడు. తాను మోసపోయినట్లు గుర్తించిన షాబాజ్‌బాషా పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసినట్లు సీఐ నారాయణరెడ్డి తెలిపారు.

సామాజిక మాధ్యమాల్లో రెచ్చగొట్టే పోస్టులు పెడితే చర్యలు



డీఎస్పీ హేమంత్ కుమార్

ధర్మవరం అర్బన్: సామాజిక మాధ్యమాలు ఫేస్‌బుక్, వాట్సప్, ఇన్‌స్టాగామ్, టెలిగ్రామ్, యూట్యూబ్, ఎక్స్(ట్విట్టర్) తదితర సోషల్ మీడియాల్లో ఇతరులను కించపరిచేలా, రెచ్చగొట్టేలా పోస్టులు పెట్టేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ బి.హేమంత్‌కుమార్ హెచ్చరించారు. స్థానిక డీఎస్పీ కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాజకీయంగా, కులాలు మధ్య విద్వేషాలు సృష్టించేలా రెచ్చగొట్టే వ్యాఖ్యలు, దుష్ప్రచారం, మతపరమైన సున్నిత అంశాల్లో వదంతులు, అవాస్తవాలు ప్రచారం చేస్తూ ఇతరుల మనోభావాలు దెబ్బతీసే విధమైన పోస్టులు పెట్టే వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. నిజానిజాలు తెలుసుకోకుండా వివాదాస్పద విషయాలు లేదా తప్పుదారి పట్టించే ఫేక్ న్యూస్ పెట్టడం, షేర్ చేయడం, అసభ్య పోస్టులు పెట్టడానికి ప్రోత్సహించడం, సహకరించడం తదితర అంశాలన్నీ చట్టరిత్యా నేరం కింద వస్తాయన్నారు. సామాజిక మాధ్యమాలపై పోలీసు నిఘా అనుక్షణం ఉంటుందని తెలిపారు. ఈ తరహా నేరాలకు పాల్పడే వారిని వెంటనే గుర్తించి కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

సత్ప్రవర్తనతో మెలగండి



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న టూ టౌన్ సీఐ రెడ్డప్ప

ధర్మవరం అర్బన్: రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలని టూ టౌన్ సీఐ రెడ్డప్ప సూచించారు. పట్టణంలోని టూ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం రౌడీషీటర్లకు కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈసందర్భంగా సీఐ మాట్లాడుతూ అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా, గొడవలు సృష్టించాలని చూసినా, గొడవల్లో పాల్గొన్నా, అల్లర్లకు కారకులైనా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఏఎస్‌ఐ డోనాసింగ్, సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లా వ్యాప్తంగా పోలీసుల ముమ్మర తనిఖీలు

పుట్టపర్తి టౌన్: నేర నియంత్రణే లక్ష్యంగా జిల్లా వ్యాప్తంగా ఆదివారం పోలీసులు ముమ్మరంగా వాహనాల తనిఖీ చేపట్టారు. జిల్లా వ్యాప్తంగా ఇటీవల జరుగుతున్న సంఘటనలు దృష్టిలో ఉంచుకొని చోరీల నియంత్రణ అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేయడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. రాత్రివేళ ముమ్మరంగా గస్తీలు చేపడుతూ నైట్ బీట్ చెకింగ్‌లు ఏర్పాటు చేసి అనుమానితులపై నిఘా పెంచారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించి ప్రజాశాంతికి భంగం కలిగించే వారిపై కేసులు నమోదు చేశారు. డ్రంకెన్ డ్రైవ్, హెల్మెట్, ఫేస్ వాష్‌పై వాహనదారులకు అవగాహన కల్పించారు. గంజాయి, అక్రమ మద్యం రవాణా, నాటు సారాలపై దాడులు చేపట్టారు. గ్రామాలను సందర్శించి గొడవలకు వెళ్లకుండా ప్రశాతంగా జీవించాలని అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. పాత నేరస్తులను స్టేషన్‌కు పిలిపించి కౌన్సిలింగ్ ఇచ్చారు.

ఘనంగా మట్టల ఆదివారం



మానవహారంగా ఏర్పడి ప్రార్థన నిర్వహిస్తున్న క్రైస్తవులు

పుట్టపర్తి టౌన్: కర్ణాటకనాగేపల్లిలోని కింగ్స్ చర్చి ఫాదర్ అరుణ్‌కుమార్ ఆధ్వర్యంలో ఘనంగా మట్టల ఆదివారాన్ని నిర్వహించారు. మొదటగా కింగ్స్ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఈత మట్టలను పట్టుకొని ఏసు గీతాలను ఆలపిస్తూ ర్యాలీ నిర్వహించారు. గ్రామ కూడలి వద్ద మానవహారంగా ఏర్పడి ప్రార్థనలు చేశారు.

ఓడీచెరువు: స్థానిక సీఅండ్‌ఐజీ మిషన్ చర్చిలో మట్టల ఆదివారాన్ని ఘనంగా నిర్వహించారు. క్రైస్తవులు మట్టలు పట్టుకొని చర్చి చుట్టూ ప్రదర్శన నిర్వహించారు. మట్టల ఆదివారం విశిష్టతను పాస్టర్ డాక్టర్ రెవరెండ్ ఎంజి జయానందం వివరించారు.

కేసు నమోదు

కదిరి అర్బన్: అప్పు చెల్లించకుండా దుర్భాషలాడిన తండ్రీకుమారులపై పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు.. కుమ్మరవీధికి చెందిన రాజీ అనే మహిళ నుంచి అడపాలవీధికి చెందిన కరేజ్‌కుమార్ అతని తండ్రి ప్రభుత్వ ఉపాధ్యాయుడు ఓబులేసు గతేడాది రూ.2.93 లక్షలు అప్పు తీసుకున్నారు. ఇందులో కొంత మొత్తం చెల్లించిన వారు మిగతాది ఇవ్వలేదు. దీనిపై ఆమె ప్రశ్నించగా దుర్భాషలాడారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ నారాయణరెడ్డి తెలిపారు.